జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ, డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక



చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



బుధవారం | 13-5-2026 | శ్రీకాకుళం | సంపుటి: 3 సంచిక: 670 పేజీలు: 4 వెల : రూ.7


* అక్రమ రవాణాపై అప్రమత్తం
* అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు నేర నియంత్రణలో అత్యంత కీలకం
* గస్తీ సమయంలో నిర్లక్ష్యం వద్దు
* సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి
* ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి
* పురుషోత్తపురం చెక్‌పోస్టు, ఇచ్ఛాపురం పీఎస్‌ల ఆకస్మిక తనిఖీ

## ప్రతి వాహనం క్షుణ్ణంగా
# తనిఖీ చేయండి



ఇచ్ఛాపురం, మే 12 (వార్త): ప్రతివాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు సంబంధిత పత్రాలు పరిశీలించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పురుషోత్తపురం చెక్‌పోస్టు సిబ్బందికి సూచించారు. పురుషోత్తపురం వద్ద ఉన్న అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్ట్, ఇచ్ఛాపురం రూరల్, టౌన్ పోలీసు స్టేషన్లను జిల్లా ఎస్పీ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద చేపడుతున్న వాహన తనిఖీలు, రాకపోకల పర్యవేక్షణ, విధుల్లో ఉన్న పోలీసు సిబ్బంది అప్రమత్తత, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. రాష్ట్ర సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, అనుమానాస్పదంగా కనిపించే వాహనాలు, వ్యక్తులను తప్పనిసరిగా ఆపి పూర్తిస్థాయిలో తనిఖీ చేయాలని సూచించారు. గంజాయి, నిషేధిత పదార్థాలు, ఇతర అక్రమ వస్తువుల రవాణాకు ఏమాత్రం అవకాశం ఇవ్వకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి వేళల్లో కూడా సమర్థవంతంగా తనిఖీలు కొనసాగించాలని, లైటింగ్ వ్యవస్థ సక్రమంగా ఉండాలని, అవసరమైతే సంబంధిత పోలీసు స్టేషన్లతో సమన్వయం చేసుకొని తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. విధుల్లో ఉన్న అధికారులు, సిబ్బంది పూర్తి అప్రమత్తతతో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వవద్దని హెచ్చరించారు. అంతర్రాష్ట్ర సరిహద్దు చెక్‌పోస్టులు నేర నియంత్రణలో అత్యంత కీలకమని, అక్రమ రవాణా, నేర కార్యకలాపాలు , అనుమానాస్పద సంచారాన్ని అడ్డుకోవడంలో ఇవి ముఖ్యపాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం ఇచ్ఛాపురం రూరల్, టౌన్ పోలీసు స్టేషన్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలీసు స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచిస్తూ, కంప్యూటర్ గది, కేసు ప్రాపర్టీ నిల్వ గది, రికార్డుల భద్రపరిచే గదులను పరిశీలించారు. పోలీసు స్టేషన్ పరిధిలోని గ్రామాలు, అంతర్రాష్ట్ర సరిహద్దు ప్రాంతాలు, వాటి భౌగోళిక స్వరూపం గురించి ఆరా తీశారు. ముఖ్యమైన కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసుల కారణాలను సమీక్షించారు. రౌడీషీటర్లపై నిరంతర కౌన్సెలింగ్ నిర్వహించాలని, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం సేకరించి వెంటనే చర్యలు తీసుకోవాలని, గంజాయి అక్రమ రవాణా అరికట్టి చర్యలు చేపట్టి బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ అధికారులకు పలు ముఖ్య సూచనలు చేశారు. ఈ పర్యటనలో టౌన్ ఎస్ఐ ఎం.ముకుంద రావు పాల్గొన్నారు. రూరల్ ఎస్ఐ జనార్ధన రావు అందుబాటులో లేకపోవడంతో రికార్డులను తీసుకుని వెళ్లినట్లు సమాచారం.





* ఇంటి నిర్మాణానికి రూ.8లక్షలు అప్పు తీసుకున్న అల్లుడు
* గ్రామపెద్దల వద్ద అప్పు తీరుస్తానని అల్లుడు ఒప్పందం
* అప్పు తీర్చకుండానే గృహ ప్రవేశానికి ఏర్పాట్లు
* అల్లుడు ఇంటి ముందు బైఠాయించిన అత్త, మామలు
* పోలీస్‌స్టేషన్‌కు చేరిన పంచాయితీ

## అల్లుడి ఇంటి ముందు..
# అత్తా మామల దీక్ష



పలాస, మే 12 (వార్త): ఇంటి నిర్మాణం కోసం అల్లుడు కోసం అప్పులు చేసి ఇచ్చిన రూ.8 లక్షలు ఇచ్చామని, ఆ డబ్బు తిరిగి ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడంటూ అత్తా, మామలు.. అల్లుడు ఇంటిముందు మౌన దీక్షకు దిగిన సంఘటన పలాస-కాశీబుగ్గలో చర్చనీయాంశమైంది. కూతురిని కోల్పోయిన బాధలో ఉన్న వృద్ధ దంపతులు ఇప్పుడు అప్పుల భారంతో వీధిన పడ్డామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దివ్య సాకేతం కాలనీలో ఇల్లు నిర్మించేందుకు డబ్బులు అవసరమని అల్లుడు అనిల్ కుమార్ తమను ఆశ్రయించాడని అత్త కొర్ల శారద, మామ తారకేశ్వరరావులు తెలిపారు. అల్లుడి భవిష్యత్తు కోసం, కుమార్తె సంతోషంగా ఉండాలనే ఆశతో తెలిసినవారి వద్ద అప్పులు చేసి దఫదఫాలుగా మొత్తం రూ.8 లక్షలు ఇచ్చినట్లు చెప్పారు. అయితే ఇటీవల వారి కుమార్తె అనారోగ్యంతో మృతి చెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. ఇదే సమయంలో అప్పులు ఇచ్చిన వారు వడ్డీతో సహా డబ్బులు తిరిగి చెల్లించాలని ఒత్తిడి చేయడంతో వృద్ధ దంపతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. డబ్బులు తిరిగి ఇవ్వాలని అల్లుడు అనిల్ కుమార్‌ను పలుమార్లు వేడుకున్నప్పటికీ స్పందించలేదని వారు ఆరోపించారు. ఈ వ్యవహారం గ్రామ పెద్దల దృష్టికి వెళ్లగా, తీసుకున్న అప్పు పూర్తిగా తీర్చే వరకు నిర్మిస్తున్న ఇంటిని హామీగా అత్త పేరుపై రాసి ఇచ్చినట్లు సమాచారం. అప్పు తీర్చిన తర్వాతే గృహప్రవేశం చేస్తానని పెద్దల సమక్షంలో అల్లుడు హామీ పత్రం కూడా రాసినట్లు స్థానికులు చెబుతున్నారు. అయితే గృహప్రవేశం చేసేందుకు అల్లుడు సిద్ధం కావడంతో సమాచారం అందడంతో అత్తమామలు కొత్త ఇంటి ముందు మౌన దీక్షకు దిగారు. “మా డబ్బులు మాకు ఇవ్వాలి... అప్పులు తీర్చాలి...” అంటూ వృద్ధ దంపతులు ఇంటి ఎదుటే బైఠాయించారు. ఈ క్రమంలో అల్లుడి సోదరుడు సంతోష్ కుమార్ అక్కడికి వచ్చి దుర్భాషలాడుతూ గొడవకు దిగారు. దీంతో అత్త కొర్ల శారద డయల్ 112కు కాల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు రక్షణ కల్పించడంతో పాటు తీసుకున్న డబ్బులు ఇప్పించాలని పోలీసులను వేడుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు ఇరువర్గాలను స్టేషన్‌కు పిలిపించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. డబ్బులు తీసుకుని మోసం చేసిన అల్లుడు అనిల్ కుమార్‌తో పాటు బెదిరింపులకు పాల్పడిన అతని సోదరుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని అత్తమామలు డిమాండ్ చేస్తున్నారు.

## 16న ముఖ్యమంత్రి
# నరసన్నపేటలో పర్యటన

* ఏర్పాట్లపై అధికారులతో కలెక్టర్ సమీక్ష



నరసన్నపేట, మే 12 (వార్త): రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈనెల 16న శ్రీకాకుళం జిల్లాలో పర్యటించనున్నారని, ఈ పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. నరసన్నపేటలో ముఖ్య మంత్రి చంద్రబాబు స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం ఖరారైన నేపథ్యంలో కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఆయన మంగళ వారం సమీక్షించారు. శాఖల వారీగా ఏయే అధి కారికి ఏయే విధులు కేటాయించింది, వివరిస్తూ జిల్లా అధికారులు సమర్థవంతంగా నిర్వహించా లన్నారు. వివిధ శాఖల అధికారులు సమన్వ యంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయ వంతం చేయాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో వర్చువల్‌గా జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి, ఆయా డివిజన్ల ఆర్డీఓలు, తహశీల్దార్లు పాల్గొనగా కలెక్టరేట్ నుండి జిల్లా రెవెన్యూ అధికారి వి. విశ్వేశ్వరావు, ఎస్డీసీలు పద్మావతి, లక్ష్మణరావు, పౌర సరఫరాల జిల్లా మేనేజర్ వేణుగోపాల్, ఆర్అండ్‌బి ఎస్ఈ పి. సత్యనారాయణ, సిపిఓ లక్ష్మీ ప్రసన్న, ఎపిసి వేణుగోపాలరావు, అదనపు డిఎంహెచ్ఓ మేరీకేథరీన్, ఇరిగేషన్ ఎస్ఈ సుధాకర్, డిప్యూటీ ట్రాన్స్ పోర్ట్ కమీషనర్ విజయ సారధి, డిఎస్ఓ సూర్య ప్రకాష్, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

# ఫ్లైఓవర్‌పై నుంచి దూకి గుర్తు తెలియని వ్యక్తి మృతి

**నరసన్నపేట, మే 12 (వార్త):** నరసన్నపేట మండలం దేవాది జాతీయ రహదారిపై ఉన్న ఫ్లైఓవర్ నుంచి గుర్తుతెలియని వ్యక్తి దూకి మృతి చెందిన ఘటన మంగళవార చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం ఆ వ్యక్తి కొంతసేపు ఫ్లైఓవర్‌పై తిరుగుతూ కనిపించాడని, అనంతరం ఒక్కసారిగా కిందికి దూకినట్లు తెలిపారు.

ఈ ఘటనను గమనించిన స్థానికులు వెంటనే అధికారులకు సమాచారం అందించారు. ఈ సమాచారం అందుకున్న ఎన్‌హెచ్-5 అంబులెన్స్ సిబ్బంది క్షతగాత్రుడిని నరసన్నపేట ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి మృతుడి వివరాలు సేకరిస్తున్నట్లు తెలిపారు. మృతుడి గుర్తింపు కోసం విచారణ కొనసాగుతున్నట్లు వెల్లడించారు.



## అరటిపండ్ల అలంకరణలో ఆంజనేయుడు

**సారవకోట, మే 12 (వార్త):** సారవకోటలోని శ్రీ ఆంజనేయ స్వామి మందిరంలో హనుమాన్ జయంతి సందర్భంగా స్వామివారి విగ్రహానికి ప్రత్యేకంగా అరటిపండ్లతో అలంకరణ నిర్వహించారు. మంగళవారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని స్థానిక హనుమాన్ భక్త సమాజం సభ్యులు స్వామివారికి సుమారు 1,008 అరటిపండ్లతో విశేష అలంకరణ చేపట్టారు. ఈ ప్రత్యేక అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఈ అరటిపండ్లను పోలాకి జడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణ చైతన్య అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మంగళవారం స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.



# కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలను విస్మరించింది

**-పేదల ఇళ్ల స్థలాలు, ఉపాధి హామీపై నిర్లక్ష్యం వహిస్తే 'చలో విజయవాడ'**

**-ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శేఖర్**

**పలాస, మే 12 (వార్త):** ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం, నేడు పేద ప్రజల సంక్షేమాన్ని గాలికొదిలేసిందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్, రాష్ట్ర నేత చాపల సుందర్‌లాల్, జిల్లా ప్రధాన కార్యదర్శి లండ వెంకటరమణ లు విమర్శించారు. మంగళవారం పలాసలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఎన్నికల వాగ్దానాలను విస్మరించి, రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సాకుతో ప్రజలను మభ్యపెడుతున్నారని మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీలపై విమర్శలు చేసిన చంద్రబాబు, తాను అధికారంలోకి వస్తే గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు ఇళ్ల స్థలం ఇస్తామని చెప్పి రెండేళ్లవుతున్నా అతీగతి లేదని ధ్వజమెత్తారు. స్థలంతో పాటు ఇళ్ల నిర్మాణానికి ఇస్తానన్న రూ. 4 లక్షల రుణ సాయం ఊసే లేదని ఆరోపించారు. పేదలకు సెంటు భూమి ఇవ్వడానికి ఆలోచిస్తున్న ప్రభుత్వం, కార్పొరేట్ సంస్థలకు మాత్రం వేలాది ఎకరాలను కారుచౌకగా కట్టబెడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 33 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు ఉండగా, అందులో 13 లక్షల ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని నేతలు తెలిపారు. భూములను కార్పొరేట్ కంపెనీలకు అప్పగించేందుకే ప్రభుత్వం చట్ట సవరణలు చేస్తోందని, ఏకంగా ఎకరం 99 పైసలకే పెట్టుబడిదారులకు కట్టబెట్టడం దారుణమని విమర్శించారు. అసైంటి భూములు చట్ట సవరణ ద్వారా పేద ప్రజల చేతుల్లో ఉన్న భూములను కార్పొరేట్ సమస్యలకు కట్టబెడుతున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేలా తెచ్చిన చట్ట సవరణలను చంద్రబాబు ఎందుకు వ్యతిరేకించడం లేదని వారు ప్రశ్నించారు. తెలంగాణ, కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు అసెంబ్లీలో వ్యతిరేక తీర్మానాలు చేసినా, ఏపీ ప్రభుత్వం మౌనంగా ఉండటం వెనుక గ్రామీణ పేదల ఉపాధిని దూరం చేసే కుట్ర ఉందని ఆరోపించారు. మహాత్మా గాంధీ పేరును తొలగించి గాడ్సే రాంజీ పేరును తీసుకురావడం వెనుక దురుద్దేశం ఉందన్నారు. రాష్ట్రంలో ఒక్క మహిళకు కూడా ప్రతినెల రూ. 1500 నగదు అందలేదని, అమ్మఒడి, అన్నదాత సుఖీభవ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకాలు కాగితాలకే పరిమితమయ్యాయని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం కేంద్రాన్ని గానీ, ప్రధాని మోదీని గానీ నిధులు అడగడంలో చంద్రబాబు విఫలమయ్యారని విమర్శించారు. పేదలకు ఇళ్ల స్థలాలతో పాటు రూ. 5 లక్షల నిర్మాణ సాయం అందించాలని డిమాండ్ చేస్తూ భవిష్యత్తులో 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని చేపడతామని నేతలు హెచ్చరించారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామీణ పేదలు కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని వారు స్పష్టం చేశారు.



# భక్తిశ్రద్ధలతో హనుమాన్ జయంతి



**పలాస, మే 12 (వార్త):** పలాసలో హనుమాన్ జయంతి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లోని ఆంజనేయ స్వామి ఆలయాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించగా పద్మనాపురం హనుమాన్ మందిరంలో, పవన్ పుత్ర కాంప్లెక్స్ ఆవరణలో, పలాస కేటీ రోడ్డులోని ఆంజనేయ స్వామిల ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. "జై హనుమాన్" నినాదాలతో ఆలయ ప్రాంగణాలు మార్మోగాయి. స్వామివారి దర్శనం కోసం భక్తులు బారులు తీరగా సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమాలు కూడా నిర్వహించారు.



# సర్వం.. హనుమాన్ స్మరణం



**సోంపేట, మే 12(వార్త):** హనుమాన్ జయంతి ఊరువాడ తేడా లేకుండా పెద్ద చిన్న భేదం లేకుండా గ్రామంలోనూ పట్టణంలోనూ ఎక్కడ చూసినా ఉత్సవాలతో, ఊరేగింపులతో, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆధ్యాత్మిక శోభ వెల్లి విరిసింది. సోంపేట కంచిలి కవిటి మండలాల్లో ఊరు రావలసిన హనుమాన్ విగ్రహాల వద్ద జయంతి పురస్కరించుకొని సోమవారం నుంచే ఘనంగా ఏర్పాట్లు నిర్వహిస్తూ మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు విశేష కార్యక్రమాలతో భక్తిశ్రద్ధలతో జై హనుమాన్ నామస్మరణతో సర్వత్రా మారు మ్రోగింది. జాతీయ పండుగను తలపించేలా పట్టణాల్లో ప్రతి వీధిలో కూడా ఉత్సవాన్ని ఎంతో వైభవంగా నిర్వహించారు. అభయాంజనేయ స్వామి ఆశీస్సులు అనుగ్రహం కోరుతూ ప్రతి ఒక్కరూ జయంతి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కంచిలిలో గల బీపీ కాలనీలో నిర్వహించిన జయంతి కార్యక్రమం కొత్తకోట శేఖర్ తదితరుల ఆధ్వర్యంలో పనుల పండుగ రాత్రి వరకు సాంస్కృతిక కార్యక్రమాలతో భారీ అన్నదాన కార్యక్రమంతో జనం మెచ్చే రీతిలో కార్యక్రమాన్ని హైలెట్గా తీర్చిదిద్దారు. అలాగే సోంపేటలోనూ యశోద నగర్ సీతారాంపేట చిన్న పల్లి వీధి ఇలా ప్రతి చోటా ఎంతో ఘనంగా నిర్వహించిన జయంతి కార్యక్రమానికి భక్తులు వేల సంఖ్యలో హాజరై స్వామివారిని భక్తిశ్రద్ధలతో దర్శించుకున్నారు. సాయంత్రం వేళ అనేక హనుమాన్ విగ్రహాల వద్ద భజన కార్యక్రమాలతో ఆంజనేయ స్వామి సేవలో తరించారు. ప్రతి చోటా ఇంచుమించుగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించి స్వామి వారిపై భక్తిని చాటుకున్నారు.



## నరసన్నపేటలో హనుమ జయంతి వేడుకలు



**నరసన్నపేట, మే 12 (వార్త):** నరసన్నపేట పరిసర ప్రాంతాల్లోని పలు అభయ ఆంజనేయస్వామి ఆలయాల్లో మంగళవారం హనుమ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. స్వామివారి ప్రీతికరమైన రోజునే జయంతి రావడంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మడపాం గ్రామంలోని 175 అడుగుల అభయ ఆంజనేయస్వామి ఆలయంతో పాటు చిక్కాలవలస, గొట్టిపల్లి తదితర గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం వరకు భజనలు, హారతులు, ప్రత్యేక సేవలు కొనసాగినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా నరసన్నపేట పట్టణంలోని పెద్దపేట శ్రీ శక్తి ఆంజనేయస్వామి దేవాలయంలో హనుమ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు వనమాలి శివ వరప్రసాద్ ఆధ్వర్యంలో కలశపూజ, సింధూరార్చన, తమలపాకుల సమర్పణ వంటి విశేష సేవలు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. ఆలయాల్లో భక్తిమయ వాతావరణం నెలకొంది.

## నేడు మందసలో ట్రీగార్డులు ఏర్పాటు



**మందస, మే 12(వార్త):** మందసలోని ఈ నెల 13న మొక్కలకు రక్షణ కంచెలు ఏర్పాటు చేస్తున్నట్టు గో గ్రీన్ మందస ప్రతినిథులు చెప్పారు. కాశీబుగ్గ అటవీ శాఖ రేంజ్ అధికారి ఎ.మురళీ కృష్ణనాయుడు చేతుల మీదుగా మొదటి ట్రీగార్డు ప్రారంభించబడుతుందన్నారు. గతంలో జరుగాల్సిన ఈ కార్యక్రమం అనివార్య కారణాలతో వాయిదా వేశారు. 13న(బుధవారం) బజారువీధి జంక్షన్ వద్ద సాయంకాలం 4 గంటలకు ట్రీ గార్డుల ప్రారంభోత్సవం జరుగుతుందన్నారు. గో గ్రీన్ సభ్యులు, పర్యావరణ ప్రేమికులు తప్పనిసరిగా 13న(బుధవారం) సాయంకాలం 4 గంటలకు బజారు జంక్షన్ వద్దకు చేరుకుని, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు.

# అభయాంజనేయుడిని దర్శించుకున్న అర్చన



**నరసన్నపేట, మే 12 (వార్త):** మడపాం గ్రామంలోని వంశధార నది తీరాన వెలసిన అభయ ఆంజనేయ స్వామి వారి జయంతి సందర్భంగా రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గ అర్చన ఆలయాన్ని సందర్శించి స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు విచ్చేసిన ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను స్వీకరించారు. జయంతి ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తిమయ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతు రాజన్న, మాజీ ఎంపీటీసీ సభ్యులు గొద్దు సుందరరావు, బూత్ ఇన్‌చార్జులు చింతు మల్లేశ్వరరావు, దిలీప్, పల్లి శ్రీనివాసరావు, మండల తెలుగు మహిళ ఉపాధ్యక్షులు రెడ్డి మణి, గదిలి వెంకటేష్, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## పారిశుధ్య పనుల వేగవంతం



**నరసన్నపేట, మే 12 (వార్త):** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ నెల 16వ తేదీన నరసన్నపేటలో చేపట్టనున్న పర్యటన ఖరారైన నేపథ్యంలో పట్టణంలో ఏర్పాట్లు వేగవంతమయ్యాయి. మంగళవారం ఉదయం జమ్ము కూడలి నుంచి నరసన్నపేట పట్టణం వరకు రహదారికి ఇరువైపులా ఉన్న చెత్త, వ్యర్థాలను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ అధికారులను ఆదేశించారు. పట్టణ పరిశుభ్రత, రహదారుల నిర్వహణ, పారిశుధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. సీఎం పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూర్మారావు, తమ్మినేని రవి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## వేధింపుల కేసులో ఒక్కొక్కరికి రూ.3వేల జరిమాన

**పలాస, మే 12 (వార్త):** కాశీబుగ్గ మేదర వీధికి చెందిన ఆరి కామేష్ అలియాస్ ఆరి కామేశ్వరరావు అతని కుమారుడు ఆరి వెంకటేష్ కు అదే వీధికి చెందిన పిల్లి శ్రావణికి వెంబడించి వేధించి చేతులతో కొట్టి బెదిరించిన కేసులో ఒక్కొక్కరికి మూడు వేల రూపాయలు చొప్పున జరిమానా విధిస్తూ పలాస జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి మంగళవారం తీర్పును వెల్లడించారని కాశీబుగ్గ సీఐ వై రామకృష్ణ తెలిపారు. 2021 వ సంవత్సరం ఏప్రిల్ నెల 26వ తారీఖున, అంతక మునుపు, కాశీబుగ్గ మేదర వీధికి చెందిన పిల్లి శ్రావణి ప్రతిదినము ట్యూషన్ చెప్పడానికి వెళ్లి వస్తున్నప్పుడు, అదే స్ట్రీట్ కు చెందిన ఆరి కామేష్ వెంటపడి తనంటే ఇష్టమని అసభ్యంగా మాట్లాడుతూ వెంబడించేవాడు. ఆ విషయమై తల్లిదండ్రులుకు చెప్పగా మందలించి విడిచిపెట్టారు. మరల అదే విషయమై పిల్లి శ్రావణి తన అక్క కుమారుడు వద్ద ఆర్ కామేసు అసభ్యంగా మాట్లాడగా ఆ విషయమై ఇంటి వద్దకు చెప్పగా శ్రావణ తల్లిదండ్రులు ఆర్ కామేష్ కు ప్రశ్నించగా ఆరి కామేషు అతని కుమారుడు వెంకటేశు చేతులతో కొట్టి చంపుతామని బెదిరించినట్లు వచ్చిన ఫిర్యాదు పై అప్పటి ఏ ఎస్ ఐ ఎస్ .రెల్లయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్ కోటర్ పి రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసు నేరం రుజువు కావడంతో తుది తీర్పు ఇచ్చారని తెలిపినారు.

జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## పదో తరగతి ఫలితాల విజయోత్సవ ర్యాలీ

**జలుమూరు, మే 12 (వార్త):** జలుమూరు మండలంలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో విద్యార్థులు మంచి ఉత్తీర్ణత శాతం సాధించడంతో మంగళవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. చల్లవానిపేట జడ్పీ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా డీఈవో ఏ. రవిబాబు పాల్గొని ఉపాధ్యాయులను అభినందించారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల బోధన, తల్లిదండ్రుల సహకారంతోనే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఆయన తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే స్థాయిలో ఫలితాలు సాధించేలా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం నిర్వహించిన విజయోత్సవ ర్యాలీలో ఎంఈఓలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని ఆనందం వ్యక్తం చేశారు.



# గ్రేవ్ కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి

### -ఎస్పీ కె.వి.మహేశ్వర రెడ్డి

### -కాశీబుగ్గ, టెక్కలి డీఎస్పీ కార్యాలయాల తనిఖీ



**పలాస, మే 12 (వార్త):** వార్షిక తనిఖీలలో భాగంగా మంగళవారం ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి కాశీబుగ్గ, టెక్కలి సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయాలను వార్షికంగా తనిఖీ చేసి పలు ముఖ్యమైన రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బంది నుండి గౌరవ వందనం అందుకున్న ఎస్పీ ఆయా సబ్ డివిజన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్‌లో ఉన్న కేసుల స్థితిగతులు, నిందితుల అరెస్టులు, ఛార్జ్‌షీట్ల దాఖలు తదితర అంశాలపై జిల్లా ఎస్పీ క్షుణ్ణంగా సమీక్షించారు.

కేసుల ఫైళ్లను పరిశీలించి, పెండింగ్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించి, ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహించాలని ఆదేశించారు. రౌడీషీటర్లకు క్రమం తప్పకుండా కౌన్సెలింగ్ నిర్వహించాలని, నాన్-బెయిలబుల్ వారెంట్ల అమలును వేగవంతం చేయాలని సూచించారు. ముఖ్యంగా పోక్సో, మహిళలపై నేరాలలో బాధితులకు న్యాయం చేకూరేలా దర్యాప్తు పారదర్శకంగా చేసి నిందితులను త్వరితగతిన అరెస్టు చేసి కోర్టులో హాజరుపరచాలని, గంజాయి, ప్రాపర్టీ కేసుల దర్యాప్తును, వేగవంతంగా పూర్తి చేసి, పోక్సో కేసులలో నిర్ణీత గడువులో ఛార్జ్‌షీట్లు కోర్టులో దాఖలు చేయాలని ఆదేశించారు. ప్రాపర్టీ కేసులను ఛేధించి దొంగిలించబడిన ఆస్తులను రికవరీ చేయాలని తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలో నేర నియంత్రణకు పటిష్ట నిఘా ఏర్పాటు చేసి, గస్తీ వ్యవస్థను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించడంతో పాటు, అవసరమైన చోట డ్రోన్ సాయంతో నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పేకాట, గంజాయి, డ్రంకెన్ డ్రైవ్, ఓపెన్ డ్రింకింగ్ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టేందుకు ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని సూచించారు. విజిబుల్ పోలీసింగ్ నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావన పెంపొందించాలని, ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలకు త్వరితగతిన పరిష్కారం చూపాలని ఆదేశించారు. సైబర్ నేరాలు, మహిళల భద్రత, సంబంధిత చట్టాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ తనిఖీల సందర్భంగా కాశీబుగ్గ డీఎస్పీ టి. భవాని, టెక్కలి డీఎస్పీ డి.లక్ష్మణరావు, సంబంధిత సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## హిందూ ధర్మాన్ని కాపాడాలి



**పలాస, మే 12 (వార్త):** హిందూ ధర్మాన్ని కాపాడేందుకు ప్రతి యువకుడు కంకణ బద్ధుడై హనుమంతుడిలా పనిచేయాలని పలాస- కాశిబుగ్గ పురపాలక సంఘం మాజీ చైర్మన్ బల్ల గిరిబాబు అన్నారు. హనుమాన్ జయంతి సందర్భంగా మంగళవారం పలాస లోగల స్థానిక పురుషోత్తపురం హనుమంతుడు విగ్రహానికి ఆయన ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులను ఉద్దేశించి బల్ల గిరిబాబు మాట్లాడుతూ రామాయణంలో శ్రీరామచంద్రుడికి నమ్మిన బంటుగా, హనుమంతుడు ప్రదర్శించిన ధైర్య సాహసాలు వర్ణింపశక్యశీ కానివని, శక్తికి వినయం తోడై, అది దైవత్వంగా బాసించిందన్నారు. సేవకుడిగా ఎలా ఉండాలి, నాయకుడిగా ఎలా నడవాలి, భక్తుడిగా ఎలా తరించాలి అనే విషయాల్లో ఆంజనేయుడు సదా, సర్వదా ఆదర్శ ప్రాయు డన్నారు. హనుమంతుని తలుచుకుంటే చాలని, ఆరోగ్యం, ఐశ్వర్యం, ధైర్యం, ఆత్మస్థైర్యం , పేరు ప్రఖ్యాతులు, జ్ఞానం, వాక్చాతుర్యం మనకు సొంతమవుతాయని, ఇన్ని సద్గుణాలను మానవాళికి అందించే హనుమంతుడికి అనునిత్యం మనం పూజించుకోవాలని బల్ల గిరిబాబు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో హనుమాన్ మందిర పూజ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

# యూరియా వాడకం తగ్గించాలి

### -వ్యవసాయ అధికారి వెంకటరావు

**సారవకోట, మే 12(వార్త):** రైతులు యూరియా వాడకాన్ని తగ్గించాలని సారవకోట మండల వ్యవసాయ అధికారి కె. వెంకటరావు సూచించారు. మంగళవారం ధర్మలక్ష్మీపురం గ్రామంలో నిర్వహించిన ఆత్మ కార్యక్రమంలో భాగంగా రైతులకు వరి పంటలో అనుసరించాల్సిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూరియాను అధికంగా వినియోగించడం వల్ల భూమి సారంతో పాటు మానవ ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడే అవకాశముందని తెలిపారు. అవసరానికి మించి రసాయన ఎరువులు వాడకుండా శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలని రైతులకు సూచించారు. సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచుతూ సమతుల్య ఎరువుల విధానాన్ని పాటిస్తే మంచి దిగుబడులతో పాటు భూసారం కూడా కాపాడవచ్చని వివరించారు. రైతులు వ్యవసాయ శాఖ సూచనలను పాటించాలని కోరారు.




## సమన్వయంతో సీఎం పర్యటన విజయవంతం చేయాలి



**నరసన్నపేట, మే 12 (వార్త):** ఈ నెల 16న జిల్లాలో ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లపై రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తో ఫోన్‌లో మాట్లాడి సమీక్ష నిర్వహించారు. నరసన్నపేట నియోజకవర్గంలో సీఎం పర్యటనకు విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టాలని అధికారులకు మంత్రి ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్‌కు సూచించారు. నిమ్మాడ క్యాంప్ కార్యాలయంలో నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి బగ్గు అర్చన తో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. పర్యటన సందర్భంగా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని వసతులు కల్పించాలని, అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి అచ్చెన్నాయుడు సూచించినట్లు సమాచారం.

## ఉపాధి హామీ పథకంలో గ్రామీణ మట్టి రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



**నరసన్నపేట, మే 12 (వార్త):** ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో పొలాలకు వెళ్లే దారుల్లో మట్టి రోడ్ల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తున్నట్లు సమాచారం. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా సుమారు 10 వేల కిలోమీటర్ల మేర గ్రామీణ మట్టి రోడ్లను నిర్మించేందుకు కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు అధికార వర్గాలు వెల్లడిస్తున్నాయి. రైతులు తమ పొలాలకు సులభంగా చేరుకునేందుకు, వ్యవసాయ పనులు వేగవంతంగా నిర్వహించేందుకు ఈ రోడ్లు ఉపయోగపడనున్నాయని పేర్కొంటున్నారు. ప్రత్యేకించి వర్షాకాలంలో బురదమయంగా మారే మార్గాల్లో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఈ రోడ్లు దోహదపడతాయని అధికారులు చెబుతున్నారు. పంటలను మార్కెట్లకు తరలించడంలో కూడా రైతులకు సౌలభ్యం కలుగుతుందని వివరించారు. ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరగడంతో పాటు మౌలిక సదుపాయాలు కూడా మెరుగుపడతాయని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

## స్వచ్ఛ నరసన్నపేటకు ప్రజలు సహకరించాలి

**నరసన్నపేట, మే 12 (వార్త):** నరసన్నపేటను స్వచ్ఛ నరసన్నపేటగా తీర్చిదిద్దే బాధ్యత ప్రజలందరిదేనని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పిలుపునిచ్చారు. మంగళవారం పట్టణంలో పర్యటించిన ఆయన పారిశుధ్య పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ప్రతి వార్డుకు ప్రత్యేకంగా ఒక బృందాన్ని ఏర్పాటు చేసి ప్రజల్లో పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఇంటి వద్ద తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య సిబ్బందికి అందించాలని, రహదారులపై చెత్త వేయకుండా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజల పూర్తి సహకారం ఉంటేనే ఆశించిన మార్పు సాధ్యమవుతుందని ఆయన స్పష్టం చేశారు. పట్టణ పరిశుభ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ కోరారు.





# సంప్రదాయ క్రీడలను ఆదరించాలి

### కబడ్డీ పోటీలను ప్రారంభించిన జిల్లా కబడ్డీ సంఘాధ్యక్షుడు వెంకన్నచౌదరి

**పలాస, మే 12 (వార్త):** ఆదరణ కోల్పోతున్న సాంప్రదాయ క్రీడలు ఆదరించాలని జిల్లా కబడ్డీ అధ్యక్షులు శ్రీ వెంకన్న చౌదరి అన్నారు. పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రౌండ్‌లో మంగళవారం నిర్వహించిన కబడ్డీ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమం ఘనంగా ప్రారంభించారు. ఈ పోటీలను జిల్లా కబడ్డీ అధ్యక్షులు వెంకన్న చౌదరి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వెంకన్న చౌదరి క్రీడాకారులతో పరిచయం చేసుకుని వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించుకోవాలని, కబడ్డీ వంటి గ్రామీణ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు క్రమశిక్షణను పెంపొందిస్తాయని అన్నారు.

క్రీడాకారులు గెలుపోటములను సమానంగా స్వీకరించి క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం క్రీడాకారులకు జెర్సీలను అందజేసి పోటీలను అధికారికంగా ప్రారంభించారు. క్రీడలను ప్రోత్సహించే ఉద్దేశంతో యువత ముందుకు రావడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, క్రీడాభిమానులు, యువకులు, క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## బీసీ కులాల అభ్యున్నతికి కృషి



**సోంపేట, మే 12(వార్త):** రాష్ట్రంలో బీసీ కులాల అభ్యున్నతి కోసం అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పలువురు నేతలు పిలుపునిచ్చారు. ఈ మండలం పలాసపురం గ్రామంలో మహాత్మా జ్యోతిరావు పూలే రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు బీన ఢిల్లీ రావు నివాసంలో మంగళవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి బీసీ సంఘాలకు చెందిన విశాఖపట్నం నుంచి డాక్టర్ అనుపల్లి అప్పారావు, అడ్వకేట్ కొరివి ప్రసాద్ కుమార్, అడ్వకేట్ వి ఎం మూర్తి హాజరై పొలి విషయాలపై చర్చించారు. బీసీలకు సంబంధించి 139 కులాలను ఏకతాటి పైకి తీసుకువచ్చి వారి ఔన్నత్యాన్ని ఉన్నతిని కాపాడే దిశలో నిజాయితీగా ప్రయాణం చేద్దామని అన్నారు. ధర్మల్ పోరాట ఉద్యమంలోనూ బీసీ సంఘాల సమస్యల సాధనలోనూ నిరంతరం కృషి చేస్తున్న ఢిల్లీ రవ్వతో కలిసి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో రాష్ట్ర సంఘం కార్యదర్శి తోట యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

## వాడవాడలా హనుమాన్ జయంతి వేడుకలు

**ఇచ్ఛాపురం, మే 12 (వార్త):** ఆంజనేయ స్వామి జయంతి సందర్భంగా వాడ వాడ లా ఘనంగా వేడుకలు నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రతి వీధిలో ముఖ్య కూడళ్లలో ఉన్న హనుమాన్ విగ్రహాలు వద్ద ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. తమలపాకులు లతో పూజలు నిర్వహించారు. సింధూర లేపనం చేపట్టారు.అన్ని విగ్రహాలు వద్ద పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆంజనేయ స్వామి కి ప్రీతి కరమైన మంగళవారం హనుమాన్ జయంతి కలిసి రావడం తో విశేష పూజలు నిర్వహించారు. హనుమాన్ మాలా ధారణ భక్తులు దీక్ష పూర్తి కావడంతో విసర్జన చేశారు. కస్పా కొయ్య వీధి లో ప్రత్యేక పూజలు జరిగాయి.బెల్లు పడా శివనంద గిరి పై ఉన్న అభయాంజనేయ విగ్రహం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొత్త వీధి ఆంజనేయ విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. కోదండరామస్వామి దేవస్థానంలో హనుమాన్ జయంతి సందర్భంగా 11 రకాల పండ్లు, 11 రకాల పుష్పాలు, 1108 నాగవల్లీ పత్రాలు (తమలపాకులు) తో అర్చన చేపట్టారు.



జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## గడ్డి మందు తాగి వ్యక్తి మృతి



**జలుమూరు, మే 12 (వార్త):** రామచంద్రాపురం గ్రామానికి చెందిన వరదు పాపారావు (57) మద్యం అనుకుని గడ్డి మందు తాగి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం పాపారావు జీవనోపాధి కోసం తన భార్యతో కలిసి నెల్లూరులో కూలి పనులు చేసుకుంటున్నాడు. ఇటీవల బంధువు వివాహ కార్యక్రమానికి స్వగ్రామానికి వచ్చిన ఆయన ఆదివారం మధ్యాహ్నం పొరపాటున గడ్డి మందు సేవించినట్లు తెలుస్తోంది. దీంతో అస్వస్థతకు గురైన ఆయనను కుటుంబ సభ్యులు వెంటనే శ్రీకాకుళంలోని ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందినట్లు సమాచారం.

ఈ ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. విషపదార్థాలను జాగ్రత్తగా భద్రపరచాలని, మద్యం సీసాల్లో ప్రమాదకర రసాయనాలు ఉంచరాదని స్థానికులు సూచిస్తున్నారు.

## వాసుదేవుపురం అంగన్‌వాడీ కేంద్రంలో కిషోరి వికాసం




**మందస, మే 12(వార్త):** వాసుదేవుపురం అంగన్ వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పెద్దింటి అరుణ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో పీఓ అరుణ మాట్లాడుతూ కిశోరి వికాసం వేసవి సెలవులు శిక్షణ కార్యక్రమాలలో భాగంగా మంగళవారం మందస మండలంలోని వాసుదేవుపురం అంగన్ వాడీ కేంద్రంలో నిర్వహించడం జరిగిందన్నారు. జీవన నైపుణ్యాలు వాటిపై సీడీపీఓ అరుణ ఆధ్వర్యంలో బాల బాలికలకు అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగిందన్నారు. ముఖ్యంగా కిశోరి బాలికల భద్రత, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యం, విద్య, పోషకాహార, రక్తహీనత, బాల్య వివాహాల నిషేధం తదితర అంశాలపై అవగహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.




## సీఎం పర్యటన విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే బగ్గు



**నరసన్నపేట, మే 12 (వార్త):** నరసన్నపేట నియోజకవర్గంలో ముఖ్యమంత్రి పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవంతం చేయాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.

మంగళవారం నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాలకు చెందిన క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, యూనిట్ ఇన్‌చార్జ్‌లు, రాష్ట్ర, జిల్లా, మండల పార్టీ అధ్యక్షులతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటన ద్వారా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించే మంచి అవకాశం లభిస్తుందని అన్నారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో మరింత చురుకుగా పనిచేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కార్యకర్తలే పార్టీకి వెన్నెముకలని, నాయకులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన మాట్లాడుతూ మహిళలు, యువత పార్టీ కార్యక్రమాల్లో మరింత చురుకుగా పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ప్రతి కార్యకర్త బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. సీఎం పర్యటన సందర్భంగా అన్ని ఏర్పాట్లు సమర్థవంతంగా నిర్వహించాలని తెలిపారు.



ఈ సమావేశంలో నాలుగు మండలాల పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ మరియు యూనిట్ ఇన్‌చార్జ్‌లు, ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డిలైట్ ఫొటోస్టూడియోలో అగ్ని ప్రమాదం



### -కంప్యూటర్లు, ప్రింటర్స్, ఫర్నిచర్ దగ్ధం

**పలాస, మే 12 (వార్త):** పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో జీడిపిక్క బొమ్మ దగ్గర్లో ఉన్న డిలైట్ ఫోటో స్టూడియోలో షార్ట్ సర్క్యూట్ అయి అగ్నిప్రమాదం సంభవించింది. ఈ అగ్ని ప్రమాదంలో కంప్యూటర్ ప్రింటర్స్ పలు మెటీరియల్స్, ఫర్నిచర్స్ అగ్నికి ఆహుతయ్యాయి. వీటి విలువ సుమారు రెండు లక్షలు వరకు ఉంటుందని బాధపడుతూ యజమాని రమేష్ తెలిపారు. స్థానికులు ఈ విషయాన్ని అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించగా అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలం చేరుకొని మంటలను అదుపు తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో సృష్టి ఐక్యత ఫోటో & వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ సభ్యులు వచ్చి స్టూడియో యజమాని రమేష్ కు సంఘీభావం తెలియజేశారు.



## మందస సెక్టార్-1లో కిషోరి వికాసం






**మందస, మే 12(వార్త):** మందస సెక్టార్-1లో కిశోరి వికాసం కార్యక్రమం ఐసీడీఎస్ సూపర్ వైజర్ సీహెచ్.వి.రామలక్ష్మి ఆధ్వర్యంలో జరిగింది. కార్యక్రమంలో రామలక్ష్మి మాట్లాడుతూ కిశోరి వికాసం వేసవి సెలవులు శిక్షణ కార్యక్రమాలలో భాగంగా మందసలోని సెక్టార్-1 అంగన్ వాడీ కేంద్రాలలో నిర్వహించడం జరిగిందన్నారు. జీవన నైపుణ్యాలు బాల బాలికలకు అవగాహన కార్యక్రమం కల్పించారు. ముఖ్యంగా కిశోరి బాలికల భద్రత, అభివృద్ధి కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యం, విద్య, పోషకాహార, రక్తహీనత, బాల్య వివాహాల నిషేధం తదితర అంశాలపై అవగహన పెంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.



## మందసలో భక్తి శ్రద్ధలతో హనుమాన్ జయంతి

**మందస, మే 12(వార్త):** మందస పట్టణంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి ఉత్సవం, శ్రీఅంజనీదేవి విగ్రహస్థాపన, ఆవిష్కరణ కార్యక్రమాలు భక్తి, శ్రద్ధలతో జరిగాయి. శ్రీఅభయాంజనేయస్వామి ఆలయ 19వ వార్షికోత్సవం కూడా వైభవంగా జరిగింది. హనుమాన్ జయంతి సందర్భంగా ఉదయం 6గంటలకు క్షీరాభిషేకం, 8గంటలకు విఘ్నేశ్వర పూజ, 9 గంటలకు మండప ఆవాహనం జరిగింది. ఉదయం 9.30గంటల నుండి అంజనీదేవిమాత విగ్రహంతో వాసుదేవపెరుమాళ్ ఆలయం నుండి అభయాంజనేయస్వామి ఆలయం వరకు తిరువీధి అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, అన్నదానం జరిగాయి. భక్తులు విచ్చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి భజనా కాలక్షేపం నిర్వహించినట్టు నిర్వాహకులు సానా గణేశ్(విఘ్నశం), బి.జగన్నాథరావు(పండా) తెలిపారు.



## ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డు అందుకున్న చిన్నమ్మి

**సారవకోట, మే 12 (వార్త):** బుడితి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో హెడ్ నర్సుగా విధులు నిర్వహిస్తున్న ఎస్. చిన్నమ్మి ప్రతిష్టాత్మక ఫ్లోరెన్స్ నైటింగేల్ అవార్డును అందు కున్నారు. అంతర్జాతీయ నర్సుల దినోత్సవం సందర్భంగా మంగళవారం గుంటూరు మెడికల్ కళాశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య మంత్రి సత్య కుమార్, ఉన్నతాధికారులు ఆమెకు అవార్డును ప్రదానం చేసి సత్కరించారు. ఆరోగ్య సేవల రంగంలో విశేష సేవలు అందించినందుకు గాను ఈ పురస్కారం అందజేసినట్లు అధికారులు తెలిపారు. రోగులకు సేవాభావంతో విధులు నిర్వహిస్తూ సహచరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అవార్డు అందుకున్న చిన్నమ్మి స్వగ్రామం టెక్కలి మండలం తిర్లంగి గ్రామం. ఆమెకు పలువురు వైద్య సిబ్బంది, స్థానిక ప్రజలు అభినందనలు తెలిపారు.




## పోలాకిలో హనుమాన్ భక్తుల బైక్ ర్యాలీ



**పోలాకి, మే 12 (వార్త):** హనుమాన్ జయంతి సందర్భంగా పోలాకి మండలం గుప్పిడిపేట గ్రామ యువకులు మంగళవారం భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బెలమర జంక్షన్ నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ డీఎల్‌పురం మీదుగా సొండిపేట, కొత్తరేవు, తోటలో కోవిరిపేట, అక్కువరం, కంబాలవానిపేట, అంపలం, రేపుఅంపలం, రాజారాంపురం, జోగంపేట, గుల్లవానిపేట గ్రామాల మీదుగా గుప్పిడిపేట వరకు కొనసాగింది. ర్యాలీలో యువకులు జై శ్రీరామ్, జై హనుమాన్ నినాదాలతో భక్తి ఉత్సాహాన్ని చాటారు. గ్రామాల్లో భక్తులు వారికి స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, జోగారావు, అప్పలస్వామి, సింహాచలం, నూకరాజు, అప్పలకొండ, మహేశ్ పాల్గొన్నారు.

## నిరుపేదలకు అండగా
## సీఎం సహాయనిధి

### - ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

**నరసన్నపేట, మే 12 (వార్త):** నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ఎంతో అండగా నిలుస్తోందని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి పేర్కొన్నారు. మంగళవారం నరసన్నపేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జలుమూరు మండలం లింగాలవలస గ్రామానికి చెందిన శిమ్మ షణ్ముఖరావు కుటుంబానికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ.2,50,000 విలువైన చెక్కును ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యనిర్వహక కార్యదర్శి బగ్గు అర్చన కూడా పాల్గొన్నారు. శిమ్మ షణ్ముఖరావు అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబానికి ప్రభుత్వం తరఫున ఈ ఆర్థిక సహాయం అందించినట్లు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జలుమూరు మండలానికి చెందిన ముఖ్య నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546